నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, గురువారం 2 జనవరి 2025 | BHADRADRI KOTHAGUDEM

పార్టీ కార్యాలయ ప్రారంభ సభలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

ఐక్యతతో ముందుకెళితే..
విజయం మనదే

- 'పోడు' పట్టాలు ఇచ్చిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదే..
- హామీలు అమలు చేయలేక కాంగ్రెస్ సర్కారు తంటాలు
- బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు
- పినపాకలో పార్టీ మండల కార్యాలయం ప్రారంభం

పినపాక, జనవరి 1: నాయకులు, కార్యకర్తలు పార్టీని క్షేత్రస్థాయి నుంచి పటిష్టం చేస్తూ.. ఐక్యతతో ముందుకెళితే ఏ ఎన్నికలు వచ్చినా గెలుపు మనదే అవుతుందని బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు స్పష్టం చేశారు. మండలంలోని ఈ బయ్యారం క్రాస్‌రోడ్‌లో బీఆర్ఎస్ మండల నూతన కార్యాలయాన్ని బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఎన్నో హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ పాలకులు.. ఇప్పుడు వాటిని అమలు చేయలేక నానా తంటాలు పడుతున్నారని విమర్శించారు. ఏడాది కాలంలోనే రేవంత్‌రెడ్డి సర్కారుపై ప్రజల నుంచి వ్యతిరేకత వచ్చిందని అన్నారు. మళ్లీ కేసీఆరే ముఖ్యమంత్రిగా రావాలని ప్రజలు కోరుకుంటున్నారని స్పష్టం చేశారు. ఆదిలాబాద్ నుంచి అశ్వారావుపేట వరకు గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములు నాలుగున్నర లక్షల ఎకరాలకు పట్టాలిచ్చిన ఘనత గత ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనని గుర్తుచేశారు. పినపాక నియోజకవర్గంలో 56 వేల మంది పోడు భూములకు పట్టాలు అందించానని జ్ఞప్తికి తెచ్చారు. ఎన్నికల హామీలను అమలు చేయాలంటూ ప్రజల తరపున బీఆర్ఎస్ నాయకులు ప్రశ్నిస్తుంటే.. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం వారిపై అక్రమ కేసులు పెడుతున్నదని ఆరోపించారు. త్వరలో జరగబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్ నాయకులంతా ఐక్యతతో పనిచేసి పార్టీ బలపర్చిన అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ నాయకులు పగడాల సతీశ్‌రెడ్డి, వర్మ, భవానీ శంకర్, పొనుగోటి భద్రయ్య, వాసుబాబు, కొండేరు రాము, సత్తిబాబు, వెంకటరెడ్డి, యగ్గడి శ్రీరాం, మణుగూరు, అశ్వాపురం మండలాల నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి టెట్ పరీక్షలు

ఏడు కేంద్రాల్లో ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహణ

ఖమ్మం ఎడ్యుకేషన్, జనవరి 1: జిల్లాలో టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) పరీక్ష ఈ నెల 2 నుంచి 20 వరకు నిర్వహించనున్నారు. ఆన్‌లైన్ విధానంలో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) పద్ధతిలో రెండు సెషన్లలో ఇంజినీరింగ్ కళాశాలల్లో పరీక్షలు జరుగనున్నాయి. పరీక్ష నిర్వహణకు ఏడు కేంద్రాలను ఎంపిక చేశారు. ఒక్కో కేంద్రానికి అబ్జర్వర్‌గా గెజిటెడ్ హెడ్ మాస్టర్‌ను కేటాయించామని, ఏడు కేంద్రాలకు ఏడు గురితోపాటు అదనంగా రిజర్వ్‌లో మరో ముగ్గురు హెచ్ఎంలకు విధులు కేటాయించినట్లు డీఈవో సోమశేఖర శర్మ తెలిపారు. ఖమ్మం బొమ్మ ఇంజినీరింగ్ కళాశాలకు కే మార్క్, ఖమ్మం డేర్ ఇంజినీరింగ్ కళాశాలకు టీ సుబ్బారావు, సత్తుపల్లి సాయిస్ఫూర్తి ఇంజినీరింగ్ కళాశాలకు ఎం.జయరాజు, సత్తుపల్లి మదర్ థెరిసా ఇంజినీరింగ్ కళాశాలకు ఎన్.నాగేశ్వరరావు, ఖమ్మం ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలకు పీ చిరంజీవినాయుడు, ఖమ్మం స్వర్ణభారతి ఇంజినీరింగ్ కళాశాలకు జీ రమేశ్, విజయ ఇంజినీరింగ్ కళాశాలకు కే వెంకటేశ్వర్లును నియమించారు.

'స్వాగత' సంబురం

- కొత్త సంవత్సరానికి ఆహ్వానం పలికిన జిల్లా ప్రజలు
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు, ప్రార్థనా మందిరాలు
- ముగ్గులతో కొత్త ఏడాదికి స్వాగతం పలికిన మహిళలు
- వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి అజయ్, ఎమ్మెల్సీ మధు

గడిచిన సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ.. కొత్త సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ మంగళవారం అర్ధరాత్రి నుంచి ఉమ్మడి జిల్లా ప్రజలు నిర్వహించిన నూతన సంవత్సర వేడుకలు అంబరాన్నంటాయి. యువతీ యువకులు కేక్‌లు కట్ చేసి కేరింతలు కొడుతూ నూతన వత్సరాన్ని స్వాగతించారు. బైక్‌లతో ర్యాలీలూ తీస్తూ సంబురంగా వేడుకలు జరుపుకున్నారు. మహిళలు, యువతులు ఇళ్ల ముంగిళ్లను రంగురంగుల ముగ్గులతో అలంకరించి మురిసిపోయారు. నూతన సంవత్సరం సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలు బుధవారం తెల్లవారుజాము నుంచే ఆలయాలు, చర్చిలకు వెళ్లి పూజలు, ప్రార్థనలు చేశారు. ఏడాదంతా సుఖసంతోషాలతో గడిచిపోవాలని, పాడిపంటలతో తులతూగాలని భక్తిభావంతో మొక్కుకున్నారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ బీఆర్ఆర్ శ్రేణులతో కలిసి తన నివాసం వద్ద కేక్ కట్ చేశారు. కార్యకర్తలు తరలివచ్చి అజయ్‌కి విషెస్ చెప్పారు. బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కూడా పార్టీ జిల్లా కార్యాలయంలో నూతన సంవత్సర కేక్ కట్ చేశారు. వారికి పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. –నమస్తే నెట్‌వర్క్

ఖమ్మం: న్యూ ఇయర్ వేడుకల్లో మాట్లాడుతున్న మాజీ మంత్రి అజయ్; బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో మాట్లాడుతున్న తాతా మధు, చిత్రంలో సండ్ర, లింగాల

ఒంటికాలిపై సీఆర్టీల నిరసన

భద్రాచలం ఐటీడీఏ ఎదుట 13వ రోజుకు చేరిన దీక్ష

భద్రాచలం ఐటీడీఏ ఎదుట ఒంటికాలిపై నిల్చొని నిరసన తెలుపుతున్న సీఆర్టీలు

భద్రాచలం, జనవరి 1: భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్లు (సీఆర్టీలు) చేపట్టిన సమ్మెలో భాగంగా బుధవారం ఒంటికాలిపై నిల్చొని నిరసన తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించాలని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ భద్రాచలం ఐటీడీఏ ఎదుట సీఆర్టీలు చేపట్టిన సమ్మె, దీక్ష బుధవారం 13వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ ఏళ్ల తరబడి పనిచేస్తున్న తమను రెగ్యులరైజ్ చేయాలని, హైకోర్టు చెప్పినట్లుగా మినిమం టైం స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీఆర్టీల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోత్ రవికుమార్, జిల్లా నాయకులు రాజేశ్, భాస్కర్, భూక్యా కోటయ్య, సురేశ్, సక్రు, మహిళా అధ్యక్షురాలు సరస్వతి, రూప, నిర్మల, కమలాజ్యోతి, వెంకట్, పాంచాలి, రాష్ట్ర, జిల్లా మహిళా నాయకులు నిర్మల, సునీత, వెంకటరమణ, బుచ్చయ్య, నర్సింహారావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తాడో పేడో తేల్చుకుంటాం..

23వ రోజు సమ్మెలో ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం నేత భూక్యా మోహన్

భద్రాద్రి కలెక్టరేట్ ఎదుట ధర్నాచౌక్‌లో సమ్మె చేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

కొత్తగూడెం ఎడ్యుకేషన్, జనవరి 1: సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) ఉద్యోగులు రోజుల తరబడి సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు భూక్యా మోహన్ విమర్శించారు. ఇక తాడో పేడో తేల్చుకుంటామని హెచ్చరించారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎస్ఏ ఉద్యోగులు భద్రాద్రి కలెక్టరేట్ ఎదుట ధర్నా చౌక్ వద్ద చేపట్టిన సమ్మె బుధవారం నాటికి 23వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాలో సమ్మె చేస్తున్న ఉద్యోగికి గుండెపోటు వచ్చినా ప్రభుత్వం కనీసం స్పందించలేదన్నారు. మీ సమస్యలు చర్చిస్తామని చెప్పి రాష్ట్ర నాయకత్వాన్ని పిలిచి బెదిరింపులకు గురిచేయడం బాధాకరమన్నారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో పోరాటం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. శిబిరాన్ని అన్ని పార్టీల నాయకులు సందర్శించి, సంఘీభావం తెలుపుతున్నారని పేర్కొన్నారు.

కొత్తగూడెం-పాల్వంచ మధ్యలో ఉన్న కేఎస్ఎం కళాశాల (మైనింగ్ ఇంజినీరింగ్ కాలేజీ)

- ప్రాభవం కోల్పోతున్న కేయూ మైనింగ్ కాలేజీ
- నాడు ఘన కీర్తి.. నేడు సమస్యల్లో ఘనాపాటి..
- పేరుకుపోయిన రూ.6 కోట్ల బకాయిలు
- మెస్ బిల్లులు, రీయింబర్స్‌మెంట్ కోసం ఎదురుచూపులు
- 34 మంది అధ్యాపకులకుగాను 12 మందితో సర్దుబాటు
- యూనివర్సిటీ చేస్తామన్న కాంగ్రెస్ హామీ నీటిమూటే..

కష్టాల్లో కేఎస్ఎం!

ఎంతో ఘన కీర్తి కలిగిన కొత్తగూడెం స్కూల్ ఆఫ్ మైనింగ్ (కేఎస్ఎం) కష్టాల్లో కొట్టుమిట్టాడుతున్నది. కాకతీయ యూనివర్సిటీతో అనుసంధానంగా ఉన్న ఈ కళాశాల నేడు సమస్యల హారతి పలుకుతున్నది. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్.. కేఎస్ఎంను యూనివర్సిటీ చేస్తామని ఎన్నికల హామీ ఇచ్చినప్పటికీ అది నీటి మూటగానే మిగిలిపోయింది. యూనివర్సిటీ చేయడం కాదు కదా.. కనీసం కాలేజీకి రావాల్సిన బకాయిలు కూడా ఇవ్వడం లేదు. దీంతో కాలేజీ యాజమాన్యం విద్యార్థులకు భోజనం పెట్టలేని దుర్భర స్థితి ఏర్పడింది. ఇదే కొనసాగితే కాలేజీ శాశ్వతంగా మూతపడే ప్రమాదమూ లేకపోలేదు.
–భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 1 (నమస్తే తెలంగాణ)

సింగరేణి సంస్థకు మైనింగ్ ఇంజినీరింగ్ విద్య అవసరమై 1978లో కొత్తగూడెం – పాల్వంచ పట్టణాల మధ్యలో మైనింగ్ కాలేజీని ఏర్పాటు చేశారు. ఇది అప్పుడు ఉస్మానియా అనుసంధానంగా ఉండేది. తెలంగాణ ఏర్పడ్డాక కాకతీయ యూనివర్సిటీ కింద కొనసాగుతున్నది. ప్రభుత్వాలు మారుతున్నా కాలేజీ తలరాత మాత్రం మారడంలేదు. గతంలో ఉన్న కేసీఆర్ ప్రభుత్వం దీనిని యూనివర్సిటీగా అప్‌గ్రేడ్ చేసే ప్రయత్నంలో ముందుకెళ్లింది. ఈ క్రమంలో కొత్త ప్రభుత్వం రావడంతో కాంగ్రెస్ సర్కారు ఆ ఫైల్‌ను మూలనపడేసింది. దీంతో కాలేజీకి కష్టాలు మొదలయ్యాయి. అధ్యాపకుల నియామకాలు జరపడం లేదు. దీంతో 34 మంది అధ్యాపకులు ఉండాల్సినప్పటికీ కేవలం 12 మందితోనే సర్దుబాటు చేస్తున్నారు. కాంట్రాక్ట్ పద్ధతిలో 8 మంది పని చేస్తున్నారు.

రూ.6 కోట్ల బకాయిలు..

375 మంది పురుషులు, 280 మంది మహిళలు హాస్టల్‌లో ఉండి ఈ కాలేజీలో చదువుతున్నారు. కానీ, వీరికి సకాలంలో మెస్ బిల్లులు రాకపోవడంతో సిబ్బంది ఇబ్బందుల పాలవుతున్నారు. ఇప్పటివరకు రూ.6 కోట్లు మెస్ బిల్లులు, ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. మైనింగ్ కోర్సు ద్వారా ఏర్పాటు చేసిన కాలేజీలో సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు ఇక్కడకు రావడానికి ఆసక్తి చూపడం లేదు. అప్పులు ఇచ్చిన షాపుల నిర్వాహకులు కాలేజీల చుట్టూ తిరుగుతుండడం గమనార్హం. ఎవరికి చెప్పినా ఫలితం లేకపోవడంతో కాలేజీ నిర్వాహకులు వేరే గ్రాంట్లను బదలాయించుకుని కాలేజీని నడుపుతున్నారు. 900 మంది ఉండే ఈ కాలేజీలో 5 కోర్సులు నడుస్తున్నాయి. సీఎస్ఈ, ఈసీసీ, మైనింగ్, ఈసీఈ, ఐటీ ద్వారా విద్యార్థులు బీటెక్ చేస్తున్నారు. కాలేజీ ఆవరణలో ఎక్కడ చూసినా పిచ్చిమొక్కలు దర్శనమిస్తున్నాయి. పేరుకే 392 ఎకరాలు స్థలం ఉన్నా అందులో ప్రభుత్వమే మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ, కలెక్టరేట్, ఇతర కార్యాలయాలకు 80 ఎకరాలను తీసుకోవడంతో చివరికి 312 ఎకరాలు మాత్రమే మిగిలింది.

కొత్తగూడెం స్కూల్ ఆఫ్ మైనింగ్ మహిళల వసతిగృహం

సిబ్బంది కొరత ఉంది..

ఎంతోకాలంగా ఈ కాలేజీ మంచిగా నడుస్తున్నది. యూనివర్సిటీ స్థాయిలో నియామకాలు జరగకపోవడంతో ఇబ్బందులు ఉన్నాయి. కాలేజీలో సిబ్బంది కొరత బాగా ఉంది. మెస్ బిల్లులు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోయాయి. భవనాలు ఉన్నప్పటికీ ఇతర సౌకర్యాలు తక్కువగా ఉన్నాయి. చాలామంది విద్యార్థులు ఇక్కడ మైనింగ్ కోర్సు పూర్తిచేసి సింగరేణిలో ఉద్యోగాలు చేస్తున్నారు.
–టీ.జగన్మోహన్‌రాజు, కాలేజీ ప్రిన్సిపాల్

కొత్త నియామకాలు ఏమీలేవు..

బీఆర్ఎస్ పాలనలో అన్ని విభాగాల్లో నియామకాలు జరిగాయి. వాళ్లందరికీ ఇప్పుడు నియామక పత్రాలు ఇస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా ఇచ్చిన ఉద్యోగాలు ఏమీ లేవు. కాకతీయ యూనివర్సిటీ అనుబంధంగా ఉన్న ఈ కాలేజీని ప్రత్యేక యూనివర్సిటీ చేస్తే అభివృద్ధి చెందుతుంది. కోర్సులు పెరుగుతాయి. సరిపడా ఫ్యాకల్టీని నియమించాలి. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీ నెరవేర్చాలి.
–ఎస్.అనుదీప్, టీఆర్ఎస్‌వీ జిల్లా కన్వీనర్

ఈ ఏడాది పబ్లిక్ పరీక్షలు పాస్ అవుతామో లేదోనని గిరిజన ఆశ్రమ పాఠశాలల పదో తరగతి విద్యార్థులు భయపడిపోతున్నారు. తమ ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ కాంట్రాక్ట్ ఉపాధ్యాయులు (కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్స్) సమ్మెలో ఉన్న విషయం విదితమే. 13 రోజులుగా విద్యాబోధన అటకెక్కింది. మరోవైపు వార్షిక పరీక్షల సమయం దగ్గరపడుతున్నది. సిలబస్ ఇంకా పూర్తికాలేదు. ఈ నేపథ్యంలో పదో తరగతి విద్యార్థులు తమ బాధ ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక అయోమయంలో ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకొని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో వెంటనే తరగతులు జరిగేలా చూడాలని డిమాండ్ చేస్తున్నారు. –ఇల్లెందు, జనవరి 1

'ఆశ్రమా'ల్లో అటకెక్కిన చదువులు

- సమ్మెలో గిరిజన ఆశ్రమ పాఠశాలల కాంట్రాక్ట్ టీచర్లు
- నిలిచిపోయిన తరగతులు.. పరీక్షలపై తీవ్ర ప్రభావం..
- తీవ్ర ఆందోళనలో విద్యార్థులు.. పట్టించుకోని ప్రభుత్వం

ఒక టీచర్‌తో ప్రేయర్ చేస్తున్న విద్యార్థులు

భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉపాధ్యాయులు గత 13 రోజులుగా సమ్మె నిర్వహిస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో భద్రాచలం ఐటీడీఏ పరిధిలో 62 పాఠశాలలు ఉండగా.. ఇందులోని 45 గిరిజన ఆశ్రమ పాఠశాలలు, 17 కన్వర్టెడ్ పాఠశాలల్లో 276 మంది కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్స్ (సీఆర్‌టీ) పని చేస్తున్నారు. వీరిలో ఉన్నత చదువులు చదివి 20 సంవత్సరాలుగా హయ్యర్ క్లాసులకు కూడా పాఠాలు చెబుతున్నవారు ఉన్నారు. వీరందరూ సమ్మెలో ఉండడంతో ప్రస్తుతానికి 60 శాతం సిలబస్ మాత్రమే పూర్తయింది. టీచర్లు రాకపోవడంతోపాటు పదో తరగతి ఫైనల్ పరీక్షలకు 3 నెలలు కాలం కూడా లేకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. మానసికంగా ఇబ్బంది పడుతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో సీఆర్‌టీలకు 12 నెలల వేతనం జీవో విడుదల చేశారు.. మూడుసార్లు వేతనాలు పెంచారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం కాంట్రాక్టు ఉపాధ్యాయులను పర్మినెంట్ చేయాలని సీఆర్‌టీలు సమ్మె నిర్వహిస్తున్నారు.

సిలబస్ ఇంకా పూర్తికాలేదు..

గంగారం ఆశ్రమ పాఠశాలలో టెన్త్ చదువుతున్నాను. 13 రోజులుగా క్లాసులు జరగడం లేదు. ముఖ్యంగా గణితం, ఫిజిక్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులు అసలు జరగట్లేదు. పరీక్షలు దగ్గరపడ్డాయి.. ఇంతవరకు సిలబస్ పూర్తికాలేదు. పబ్లిక్ పరీక్షల్లో పాస్ అవుతామో లేదోనని భయంగా ఉంది. దయచేసి సమస్యలను వెంటనే పరిష్కరించాలి. **–మూతి సుశాంత్, టేకులపల్లి**

ప్రతిరోజూ అన్ని క్లాసులూ జరగట్లేదు..

నేను సింగరేణి (కారేపల్లి) మండలం రేలకాయపల్లి ఆశ్రమ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాను. మాకు ప్రతి రోజూ అన్ని సబ్జెక్టుల క్లాసులు జరగడం లేదు. ముఖ్యంగా తెలుగు, గణితం టీచర్లు సమ్మెలో ఉండడం వల్ల మాకు ఆ తరగతులు జరగట్లేదు. వారి సమస్యలు వెంటనే పరిష్కరించి పాఠశాలకు పంపించాలి. **–పిల్లలమర్రి వాసు, కారేపల్లి**

విడిది ఏర్పాట్లు పూర్తి చేయండి

భద్రాచలంలో ముక్కోటి ఏర్పాట్ల పరిశీలనలో కలెక్టర్, పీవో

భద్రాచలం, జనవరి 1: ముక్కోటి ఉత్సవాల్లో భాగంగా పర్యాటకుల విడిది కోసం గోదావరి ఒడ్డున ఏర్పాటుచేస్తున్న గుడిసె (హట్)ల నిర్మాణాలను నిర్ణీత సమయం కంటే ముందుగానే పూర్తి చేయాలని భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. ముక్కోటి అధ్యయనోత్సవాల ఏర్పాట్లలో భాగంగా ఐటీడీఏ పీవో రాహుల్‌తో కలిసి భద్రాచలంలో బుధవారం సాయంత్రం పర్యటించిన ఆయన.. గోదావరి నది ఒడ్డున విడిది ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కరకట్ట ఖాళీ ప్రదేశాల్లో నిర్మిస్తున్న విడిది హట్‌లను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. 6వ తేదీ నాటికి ఏర్పాట్లన్నీ పూర్తిస్థాయిలో జరగాలని, ఈ విషయం 9వ తేదీ నాటికి భక్తులకు తెలిసేలా ఆయా శాఖల అధికారులు ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. విడిది గృహాల్లో ఉండే భక్తులు, పర్యాటకులకు గిరిజనుల వంటకాలు మాత్రమే సరఫరా చేయాలని, వ్యర్థాలు ఎక్కడపడితే అక్కడ పడేయకుండా చెత్త బుట్టలు ఏర్పాటు చేయాలని సూచించారు. కరకట్ట వద్ద స్టాళ్లు కూడా ప్రధానంగా గిరిజనులకు సంబంధించినవి మాత్రమే ఉండాలని ఆదేశించారు. ఆర్డీవో దామోదరరావు, ఇరిగేషన్ డీఈ వెంకటేశ్వర్లు, ఏఈ వెంకటేశ్వర్, ఏసీఎంవో రమణయ్య, మిషన్ భగీరథ అధికారి రాజారావు, ఏపీఎంలు జగదీశ్, కిశోర్, జేడీఎం హరికృష్ణ, జీపీఈవో శ్రీనివాసరావు, మ్యూజియం ఇన్‌చార్జి వీరాస్వామి పాల్గొన్నారు.

ముక్కోటి విడిది ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ జితేశ్, పీవో రాహుల్